సాక్షి మంచిర్యాల

మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024

రక్షణ చర్యలపై అవగాహన

మందమర్రిరూరల్: విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ఎన్డీఆర్ఎఫ్ 10 బెటాలియన్ కమాండర్ బిటెన్‌సింగ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోమవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంఈవో జాడి పోచయ్య, జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



విధుల్లోకి నర్సింగ్ సిబ్బంది

పాతమంచిర్యాల: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో 237మంది నర్సింగ్ సిబ్బందిలో సోమవారం 175మంది విధుల్లో చేరినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి తెలిపారు.

గరిష్టం/కనిష్టం 34.0 /22.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి 'గృహజ్యోతి' సర్వే

మంచిర్యాలఅగ్రికల్చర్: ఆరు గ్యారంటీల అమలులో భాగంగా గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల విద్యుత్ వినియోగదారులను గుర్తించేందుకు జిల్లా విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. ప్రభుత్వం ఆదేశాల మేరకు మంగళవారం నుంచి సర్వే చేపట్టనుంది. గృహ వినియోగ విద్యుత్ మీటరు ప్రస్తుత బిల్లు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫోన్‌నంబరు అనుసంధానం చేయనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో సోమవారం సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 3.47లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. గృహావసరాలకు 200 యూనిట్లు వినియోగిస్తున్న విద్యుత్ మీటర్లు 2,10,965 ఉన్నాయి. ఈ నెల ఒకటి నుంచి బిల్లింగ్ చేపట్టిన విద్యుత్ శాఖ సిబ్బంది మరోమారు వివరాలు సేకరించనున్నారు. అర్హులను గుర్తించేందుకు మంగళవారం జిల్లా విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశం నిర్వహిస్తామని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ శేషారావు తెలిపారు.

ప్రత్యేక అధికారులదే కీలకపాత్ర

మంచిర్యాలఅగ్రికల్చర్: సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినందున గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రత్యేక అధికారులు కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో ప్రత్యేక అధికారులు, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, జవాబుదారీతనంతో వ్యవహరించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జెడ్పీ సీఈవో నరేందర్, మిషన్ భగీరథ ఈఈ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు అవిశ్వాస తీర్మానంపై సమావేశం

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మాన సమావేశం మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో రాములు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఉదయం 11గంటలకు చైర్‌పర్సన్ జంగం కళ, మధ్యాహ్నం 12.30గంటలకు వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డిలపై అవిశ్వాస తీర్మాన ఓటింగ్ నిర్వహిస్తారు. కాగా, బీఆర్ఎస్ సొంత పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇవ్వగా.. రెండుగా చీలిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుత చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ సహా 8మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో సమీకరణలు తారుమారు అయ్యాయి. అవిశ్వాస తీర్మాన సమావేశం దాదాపుగా జరిగే అవకాశాలు కనిపించడం లేదు. కాంగ్రెస్ గూటికి చేరిన 8 మంది ప్రస్తుతం కాకినాడ క్యాంపులో ఉన్నారు. వారు గైర్హాజరయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇక బీఆర్ఎస్‌కు చెందిన 13 మంది హాజరైనా కోరం లేక వీగిపోయే అవకాశం ఉంది. ఇదే జరిగితే బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న మున్సిపాలిటీ కాంగ్రెస్ ఖాతాలోకి మారి మళ్లీ ప్రస్తుత చైర్‌పర్సన్ జంగం కళ, వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డిలే వారి వారి పదవుల్లో కొనసాగే అవకాశాలున్నాయి.

తీరని భూ సమస్యలు!



ఈయన దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్‌కు చెందిన గడ్డం రాజయ్య. తన తండ్రి చంద్రయ్య చనిపోయాక ఆయన పేరుతో ఉన్న 2.27ఎకరాల విరాసత్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకు కుటుంబసభ్యుల అందరితో సంతకాలు చేయించాడు. భూమి రికార్డు ప్రకారం 2గుంటలు ఎక్కువగా పడడంతో విరాసత్ కావడం లేదు. గత ఏడాది క్రితం విరాసత్ కోసం దరఖాస్తు చేసుకున్నా నేటికీ పరిష్కారం కాలేదని వాపోతున్నాడు. తమ సమస్య పరిష్కరించాలని కోరడానికి మరోసారి కలెక్టర్‌కు విన్నవించాడు.



ఇతడి పేరు పంచెర్పుల సత్తయ్య. దండేపల్లి మండలం వెల్గనూరు. అందుగులపేట శివారు సర్వే నంబరు 40లోని 03.5గుంటల భూమికి పాస్‌బుక్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. గతేడాది నుంచి ఈ భూమికి సంబంధించిన ఉన్నతాధికారులకు రిపోర్టు రావడం లేదని, సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఈ భూమిలో మరొకరితో వివాదం ఉండడంతో అధికారులు సైతం ఎటూ తేల్చడం లేదు. దివ్యాంగురాలైన కూతురికి కట్నం కింద ఇచ్చిన భూమి కావడంతో తమ సమస్యకు పరిష్కారం చూపాలని వేడుకుంటున్నాడు.

- జిల్లాలో ఏళ్లుగా అపరిష్కృతంగానే..
- ప్రతీ వారం ప్రజాఫిర్యాదుల్లో ఇవే అధికం
- ఆఫీసుల చుట్టూ బాధితుల ప్రదక్షిణ
- 'ధరణి' మాడ్యూల్ అర్జీలకు పరిష్కారం కరువు



జిల్లాలో భూ వివరాలు(ఎకరాల్లో)

వ్యవసాయ భూమి	3,36,053
అసైన్డ్ భూమి	99,860
అటవీ భూమి	4,39,161
వక్ఫ్‌భూములు	83
దేవాదాయ భూములు	81

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో భూ సమస్యలు తీరడం లేదు. ఏళ్లకేళ్లుగా తమ భూ సంబంధ అపరిష్కృత సమస్యలతో బాధితులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లోనూ భూ సమస్యలే అధికంగా ఉంటున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర భూ ప్రక్షాళన పేరుతో భూముల వివరాలు సరిచేసేందుకు కార్యక్రమం చేపట్టింది. తర్వాత రెవెన్యూ శాఖలో భారీ మార్పులు చేస్తూ 2020 సెప్టెంబర్ 2న ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. అయినా ఇప్పటికీ అనేక మంది భూ యాజమాన్య సంబంధిత సమస్యలతో సతమతం అవుతున్నారు. ఆరేళ్ల క్రితం నిర్వహించిన సమగ్ర భూ ప్రక్షాళన సమయంలో కొన్ని తప్పులు దొర్లడంతో ఇప్పటికీ 'ధరణి'లో అవే రికార్డులు వస్తున్నాయి. కాంగ్రెస్ సర్కారు రాకతో ధరణి పోర్టల్ రద్దు చేస్తామని ప్రకటించడం, ఆ స్థానంలో మరో పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తామని చెప్పడంతో పెండింగ్ భూ సమస్యలు ఇంకా పేరుకుపోతున్నాయి. నేటికీ పాత సమస్యలే పరిష్కారం కావడం లేదు. భూ సమస్యలు పరిష్కారం కోసం పోర్టల్‌లో కలెక్టర్ లాగిన్‌లోనే జరగాలి. ధరణి అందుబాటులోకి వచ్చాక జిల్లాలో 47వేలకుపైగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇక సమస్యలపై 33 మాడ్యూల్స్ కింద జిల్లాలో 35వేల వరకు అర్జీలు వచ్చాయి. వీటిలో 26వేల దరఖాస్తులు పరిష్కారం కాగా, మరో నాలుగు వేల దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయా రైతులు రైతుబంధు, బీమా, రుణాలు తదితర సదుపాయాలకు దూరమవుతున్నారు.

హక్కుల్లో వీడని చిక్కులు..

భూ హక్కులు పొందడంలో క్షేత్రస్థాయిలో అనేక చిక్కులు ఎదురవుతున్నాయి. అసైన్డ్, అటవీ, రెవెన్యూ, ఇతర వివాదాలు, కుటుంబ తగాదాలు, భూముల్లో హెచ్చుతగ్గులు, సరిహద్దులు, కోర్టు కేసులు ఇలా అనేకంగా ఉంటున్నాయి. ఇవి పరిష్కారం దిశగా వెళ్లకపోవడంతో చాలా వరకు భూ సమస్యలు అలాగే మిగిలిపోతున్నాయి. కొన్ని చోట్ల కోర్టు పరిధిలో ఉంటూ విచారణలో ఉండి ఎటూ తేలడం లేదు. సర్వేలు, కొలతలు చేయకపోవడంతోనూ అపరిష్కృతంగా ఉంటున్నాయి. మరికొన్ని చోట్ల వారసత్వ పంపకాలు, గొడవలతో శాంతిభద్రతల సమస్యలతోనూ రెవెన్యూ అధికారులు సైతం ఏం తేల్చకుండా నిలిపివేస్తున్నారు.

కొత్త పోర్టల్ వస్తేనైనా?

ధరణి స్థానంలో సమగ్రంగా ఉండేలా 'భూ భారతి' పేరుతో కొత్త పోర్టల్ అందుబాటులోకి తెస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల ప్రచారంలోనూ చెప్పింది. మేనిఫెస్టోలోనూ చేర్చింది. ఈ సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ఓ కమిటీని ఏర్పాటు చేసి నిపుణులతో కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో కొత్త పోర్టల్ వచ్చే వరకు జిల్లాలో భూ సమస్యలకు పరిష్కారం దొరికే అవకాశాలు కనిపించడం లేదు. జిల్లాలో భూ సమస్యలతో బాధితులు తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయాల వరకు కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. క్షేత్రస్థాయిలోని అధికారులతో సమగ్రంగా విచారణ చేపట్టి జిల్లాలో భూ సమస్యలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

మంటలు రేపిన సుమన్ వ్యాఖ్యలు

- తీవ్రంగా స్పందించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- దిష్టిబొమ్మల దహనం, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు



సుమన్‌పై ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తీవ్ర పదజాలంతో దూషిస్తూ చేసిన వ్యాఖ్యలు జిల్లాలో రాజకీయంగా మంటలు రేపాయి. సోమవారం బీఆర్ఎస్ మంచిర్యాల నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సమావేశంలో సుమన్ మాట్లాడుతూ తీవ్రస్థాయిలో ఘాటుగా మాట్లాడడంపై జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భగ్గుమన్నారు. జిల్లాలోని చెన్నూరు, మందమర్రి, దండేపల్లిలో బాల్క సుమన్ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. సోషల్ మీడియాలోనూ పార్టీ నాయకులు ఘాటుగా స్పందించారు. లోక్‌సభ ఎన్నికల ముందు అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ పార్టీ మధ్య తీవ్రస్థాయిలో ఆరోపణలు జరుగుతున్నాయి. మరోవైపు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎంవీ గుణ స్పందిస్తూ బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. మంచిర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అధికారంలోకి రావడం జీర్ణించుకోలేక



బెల్లంపల్లి: కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడాన్ని జీర్ణించుకోలేక మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సీఎం రేవంత్‌రెడ్డి దుర్భాషలాడడం సరికాదు. భాష అత్యంత హేయంగా ఉంది. ప్రజాస్వామ్యంలో అలా మాట్లాడడాన్ని ప్రజలు హర్షించరు. సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతారు. సీఎంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలి. – ఎమ్మెల్యే వినోద్, బెల్లంపల్లి

సుమన్ రాసలీలలు బయటపెడతాం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అనరాని భాషలో బాల్క సుమన్ మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. రేపటి నుంచి నువ్వు ఎక్కడ తిరుగుతావో చూస్తాం. కార్యకర్తలు, ప్రజలే నీకు బుద్ధి చెప్తారు. నువ్వు చేసిన రాసలీలలు, నీ కథలన్నీ బయటపెడతాం. దీనికి కచ్చితంగా తగిన శాస్తి చేస్తాం.

– ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, మంచిర్యాల

అహంకారంతో ప్రవర్తిస్తున్నారు



రాజకీయాల్లో ఇలాంటి నాయకులు ఎట్లా? ఇష్టమొచ్చినట్లు సీఎం రేవంత్‌రెడ్డిపై మాట్లాడుతున్నారు. అధికారంలో ఉండగా అహంకారంతో ఇలాగే మాట్లాడాడు. ప్రజలు సరైన గుణపాఠం నేర్పారు. ఇప్పటికీ తప్పులు సరిదిద్దుకోవాలనే ఆలోచన లేకుండా మళ్లీ అలానే ప్రవర్తిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలా దిగజారి మాట్లాడడం సరైంది కాదు. దీనిని ఖండిస్తున్నాం.

– ఎమ్మెల్యే గడ్డం వివేక్, చెన్నూరు

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం



దండేపల్లిలో సుమన్ దిష్టిబొమ్మతో శవయాత్ర



చెన్నూర్‌లో సుమన్ దిష్టిబొమ్మ దహనం

చెన్నూర్: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సోమవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి చెప్పులదండ వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు చెన్నూరి శ్రీధర్ మాట్లాడుతూ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేనిపక్షంలో జిల్లాలో తిరుగనివ్వబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెన్న సూర్యనారాయణ, పాతర్ల నాగరాజు, లింగంపల్లి మహేశ్, కడవండి మహేశ్, గజ్జెల అంకగౌడ్ పాల్గొన్నారు.

దండేపల్లిలో..

దండేపల్లి: సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దండేపల్లిలో సోమవారం రాత్రి సుమన్ దిష్టిబొమ్మతో స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మంచిర్యాలక్రైం: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ తీవ్రంగా ఖండించారు. మంచిర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పెంట రజిత, పట్టణ మహిళా అధ్యక్షురాలు గజ్జల హేమలత, నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సుమన్‌పై ఫిర్యాదు చేశారు. పట్టణ మైనారిటీ అధ్యక్షుడు నజీర్, ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు వెంకటసాయి, కలువల జగన్, శ్రీనివాస్‌గౌడ్, బొల్లం భీమన్న, కాంకణాల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు మేరకు సుమన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు.

మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన ప్రభుత్వం

- అమలు చేయకుంటే రణరంగమే..
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

మంచిర్యాలక్రైం: కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిందని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో సోమవారం పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అధ్యక్షతన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి భయపడాల్సిన అవసరం లేదని, గులాబీ జెండా పట్టింది తెలంగాణ కోసమేనని అన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో 17 ఎంపీ సీట్లు గెలిచి బీఆర్ఎస్ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ప్రజల కోసం కొట్లాడేందుకు పార్టీ నాయకులు సిద్ధంగా ఉండాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420హామీలు నెరవేర్చకుంటే రణరంగమేనని హెచ్చరించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరిచి మాట్లాడడం సరికాదని అన్నారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలైనా ఇచ్చిన హామీల్లో ఒక్కటీ పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. రైతుబంధు కోసం గత ప్రభుత్వం విడుదల చేసిన రూ.7,700 కోట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు, కాంగ్రెస్ కాంట్రాక్టర్ల జేబుల్లోకి మలుపుకొని రైతు నోట్లో మన్ను కొట్టారని ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కేంద్రం, పక్క రాష్ట్రాల వాళ్లు మన ప్రాజెక్టుల వైపు చూడాలంటేనే భయపడ్డారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులన్నీ కేంద్రం చేతుల్లోకి వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ కుటుంబ పాలన అంటూ విమర్శించారని, ఒకే పార్లమెంటు పరిధిలో అన్నదమ్ములు ఇద్దరు ఎమ్మెల్యేలు అయ్యారని, కొత్తగా వివేక్ కుమారుడు వంశీకి ఎంపీ టికెట్ కోసం ఆశపడడం కుటుంబ పాలన కాదా అని ప్రశ్నించారు. సూటు బూటు వేసుకుని సూట్‌కేసులతో రాజకీయాలను కలుషితం చేయడానికి కాకా కుటుంబ సభ్యులు మళ్లీ బయల్దేరారని, పెద్దపల్లి పార్లమెంటు స్థానంలో సామంత రాజులా వ్యవహరించాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో పెద్దపల్లిలో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ తిప్పని లింగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, లక్సెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, మంచిర్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేష్, చందన వెంకటేష్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ బి.సంతోష్
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అధికారులను ఆదేశించారు. నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 64అర్జీలు అందగా.. సంబంధిత అధికారులకు అందజేసి అత్యంత ప్రాధాన్యతనిచ్చి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

- గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ నాయకులు బెల్లంపల్లిలో సింగరేణి, లావాణి, అటవీ భూములు కబ్జా చేశారని, ఇళ్లు నిర్మించి విక్రయించారని, సింగరేణి క్వార్టర్లు ఆక్రమించారని, వారిపై చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లికి చెందిన కొలిపాక శ్రీనివాస్ కోరారు.
- తన తండ్రి వారసత్వంగా రావాల్సిన భూమి తనకు రావడం లేదని, పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని నెన్నెల మండలానికి చెందిన తోట మల్లేశం అర్జీ సమర్పించారు.

ఆపద్బంధు వర్తింపజేయాలి



2020 సెప్టెంబర్ 17న నా భర్త పెంటు ఇంటి మీద నుంచి పడిపోయి చనిపోయాడు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఆపద్బంధు పథకం వర్తింపజేసి రూ.లక్ష ప్రభుత్వ సాయం అందించి ఆదుకోవాలి.

– దుర్గం లక్ష్మి, గ్రామం: కిష్టంపేట, మం: చెన్నూర్

న్యాయం చేయాలి



నా భర్త నాలుగేళ్ల క్రితం, అత్తమామలు మూడేళ్ల క్రితం చనిపోయారు. దీంతో దిక్కులేని దాన్ని అయ్యాను. ఇంటి కోడలిగా నాకు రావాల్సిన వ్యవసాయ భూములు మామ తమ్ముడు, అక్కాచెల్లెళ్లు ఆక్రమించుకుని అన్యాయం చేశారు. నాకు రావాల్సిన భూమి, ఇతర ఆస్తులు ఇప్పించాలి. వారిపై చర్యలు తీసుకుని నాకు న్యాయం చేయాలి.

– దాసరి సుమలత, గ్రామం: కుందారం, మం: జైపూర్

ఆదివాసీలపై నిర్లక్ష్యం తగదు



కాసిపేట మండలం కుర్రేఘడ్ గ్రామంలో నిర్వహించే పాహుండి కుమార్ లింగు స్వామి జాతర నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆదివాసీల పట్ల చిన్నచూపు తగదు. ప్రతియేటా నిర్వహించే ఈ జాతరకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నాం. సౌకర్యాలు కల్పించాలి.

– కాసిపేట మండల ఆదివాసీలు

గొర్రెలు పంపిణీ చేయాలి



రెండో విడత గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించి 18నెలలుగా ఎదురుచూడాల్సి వస్తోంది. అప్పులు చేసి డీడీలు కట్టాం. వడ్డీలు పెరిగిపోతున్నాయి తప్ప గొర్రెలు పంపిణీ చేయడం లేదు. ఇప్పటికైనా గొర్రెల యూనిట్లు అందించాలి.

– జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి, జైపూర్ మండల గొల్లకుర్మల నాయకులు

రోడ్డు వేసి దూరభారం తగ్గించాలి

జన్నారం మండలం సూరారపు గూడెం, రెండ్లగూడ, లింగయ్యపల్లె, చింతంపల్లె గ్రామాల రైతులం. మాకు పొన్కల్ శివారులో పంట భూములు ఉన్నాయి. ఈ భూములకు సాగు కోసం వెళ్లాలంటే ధర్మారం–సూరారపు గూడెం మధ్యలో నుంచి రోడ్డు వేస్తే చింతలపల్లి, చెరుకుగూడెం, లింగయ్యపల్లి రైతులకు దూరభారం తగ్గుతుంది. రోడ్డు వేసి రైతుల ఇబ్బందులు తొలగించాలి.

– జన్నారం మండల రైతులు



భూములు కోల్పోతున్నాం..



ఇప్పటికే గతంలో నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టుతో విలువైన వ్యవసాయ భూములు కోల్పోయాం. ఇప్పుడు గోదావరి తీరం వెంట నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం పేరున వ్యవసాయ భూముల సేకరణకు రెవెన్యూ అధికారులు పనులు ప్రారంభించారు. మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. ఈ రహదారి కోసం అధికారులు రెండు సర్వేలు చేశారు. ఇప్పటికే ఉన్న మెయిన్ రోడ్డు నుంచి కాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం పంట పొలాల మీదుగా తీస్తున్నారు. పంటపొలాల నుంచి కాకుండా పాత రోడ్డు వెంటనే హైవే రోడ్డు వేయాలి. – లక్సెట్టిపేట మండల రైతులు

కబడ్డీ ఆడిన ఎమ్మెల్యే వినోద్



కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే వినోద్

నెన్నెల: నిత్యం రాజకీయ వ్యవహారాలతో బిజీగా ఉండే బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సరదాగా కబడ్డీ ఆడి ఆటగాళ్లను ఉత్సాహపర్చారు. మండలంలోని గొల్లపల్లిలో కాకా వెంకటస్వామి జ్ఞాపకార్థం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు తమ్మినవేణి రాజేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ టోర్నీలో 26జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి ఎంపీటీసీ హరీష్‌గౌడ్, మాజీ సర్పంచ్ ఇందూరి శశికళ, కాంగ్రెస్ నాయకులు నేతరి స్వామి, గట్టు మల్లేష్, మంచర్ల వెంకటేష్, శంకరయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

బెల్లంపల్లి: ప్రభుత్వ ప్రోత్సాహంతో విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ)లో విద్యార్థులకు ఐఐటీ, నీట్ ఫౌండేషన్ కోర్సు మెటీరియల్ పంపిణీ చేశారు. సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, జేవీపీ పొన్నం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు దావ రమేష్, నాతరి స్వామి, పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు పూదరి నగేష్ పాల్గొన్నారు.

ఈవీఎంల తనిఖీ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఈవీఎంల మొదటి దశ తనిఖీ చేపట్టామని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోదాము, హాజీపూర్ మండలం ముల్కల్లలోని ఐజా ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతిలాల్, చెన్నూర్ ప్రత్యేక సబ్ కలెక్టర్ దత్తులతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా జిల్లాలో 850 బ్యాలెట్ యూనిట్లు, 838 కంట్రోల్ యూనిట్లు, 1092 వీవీ ప్యాట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

7న కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

శ్రీరాంపూర్: సీసీసీలోని కుమార్ స్పోర్ట్స్ డిఫెన్స్ అకాడమీలో ఈ నెల 7న సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాంచందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 సంవత్సరాలలోపు బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఎంపికైన జట్లు ఈ నెల 16 నుంచి 19 వరకు సూర్యాపేట జిల్లాలోని మల్లారెడ్డిగూడెంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 7702115889 నంబరులో సంప్రదించాలని సూచించారు.

యోగా పోటీల్లో ప్రతిభ



మెమొంటో అందుకుంటున్న భగవాన్‌దాస్

లక్సెట్టిపేట: ఇండియన్ యోగా పాఠశాల ఆధ్వర్యంలో ఈ నెల 4న బెల్లంపల్లిలో నిర్వహించిన జాతీయస్థాయి యోగాసన్ చాంపియన్ షిప్ పోటీలలో పట్టణానికి చెందిన రాపల్లి భగవాన్ దాస్ పాల్గొని ప్రథమస్థానంలో నిలిచారు. నిర్వాహకులు రాజలింగు చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు. ఈసందర్భంగా పట్టణానికి చెందిన పలువురు ఆయనను అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం

దండేపల్లి: సాంఘికశాస్త్రం ఫోరం ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన సాంఘిశాస్త్ర ప్రతిభా పాటవ పోటీ ల్లో మండలంలోని వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి అభినయ్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఇదే పాఠశాల నుంచి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం ఇది ఐదోసారి. రాష్ట్ర స్థాయికి ఎంపికైన అభినయ్‌ను హెచ్‌ఎం విజయలక్ష్మి, గైడ్ టీచర్ నరసింహులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్‌తో మైనింగ్ సిబ్బంది

భీమారం: జైపూర్ మండలంలోని రసూల్‌పల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు మంచిర్యాల మైనింగ్ ఏడీఏ బాలు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా రసూల్‌పల్లి వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారం రావడంతో మైనింగ్ సిబ్బంది వెళ్లి ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను జైపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నామానగర్ గ్రామానికి చెందిన దడ్డి సత్యంపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన ఇట్యాల ఆశాలుపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ తెలిపారు. పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని ఆశాలు, సత్యంపై దాడి చేశారని పేర్కొన్నారు. సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఆయన పేర్కొన్నారు.



ఇంద్రాదేవికి మొక్కుతున్న మెస్రం వంశీయులు



మర్రిచెట్టు వద్ద గంగాజలం భద్రపరుస్తున్న మెస్రం పెద్దలు



నైవేద్యాలు తయారు చేస్తున్న మెస్రం ఆడపడుచులు



కేస్లాపూర్ మర్రిచెట్టు వద్ద మెస్రం వంశీయులు

ఇంద్రాదేవికి 'మెస్రం' పూజలు..

- అనంతరం కేస్లాపూర్‌కు పయనం
- మర్రిచెట్టు వద్ద బస

ఇంద్రవెల్లి: నాగోబా జాతరలో భాగంగా మహాపూజకు అవసరమయ్యే గంగాజలం సేకరించిన మెస్రం వంశీయులు పాదయాత్రగా సోమవారం ఇంద్రవెల్లికి చేరుకున్నారు. ఇంద్రాదేవి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. పవిత్ర గంగాజలాన్ని ఆలయం ఎదుట ఉన్న మర్రి చెట్టుపై భద్రపరిచారు. వీరి రాక నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి 22 కితల మెస్రం వంశీయులు ఎడ్ల బండ్లతో ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయం ప్రకారం నైవేద్యాలు తయారు చేసి అమ్మవారికి సమర్పించారు. రాత్రి కేస్లాపూర్ సమీపంలోని మర్రి చెట్టు వద్దకు చేరి అక్కడే బస చేశారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు సంప్రదాయ పూజలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రధాన్ కితకు చెందిన దాదారావ్ ఆధ్వర్యంలో నాగోబా చరిత్ర బోధిస్తారు. ఈ నెల 9న రాత్రి 10:30 గంటలకు మహాపూజ అనంతరం జాతర ప్రారంభించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావ్ తెలిపారు. కార్యక్రమంలో మెస్రం వంశపెద్దలు కోసు కటోడా, కోసేరావ్, దాదారావ్, హనుమంత్‌రావ్, తిరుపతి తదితరులున్నారు.

ఆశలు రేకెత్తిస్తున్న 'మామిడి'

- విరగబూసిన మామిడి చెట్లు
- రైతుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం
- ప్రకృతి కరుణిస్తే లాభాల పంట
- సస్యరక్షణ చర్యలు తీసుకోవాలంటున్న ఉద్యాన అధికారులు



నిండుగా వచ్చిన పూతతో మామిడి చెట్లు

బెల్లంపల్లి/చెన్నూర్‌రూరల్/నెన్నెల: ఈ ఏడాది విరగబూసిన మామిడి తోటలు రైతుల్లో ఆనందాన్ని కలిగిస్తున్నాయి. మొన్నటి వరకు బోసిగా కనిపించిన చెట్లు ఈ వారంలో మామిడి పూతతో కళకళలాడుతున్నాయి. కొమ్మ కొమ్మకు పూత ఏపుగా రావడంతో చెట్లన్నీ పసిడి వర్ణాన్ని పులుముకున్నాయి. ప్రస్తుతం వచ్చిన పూత, కాత చివరి వరకు నిలిచి ఎలాంటి తెగుళ్ల సోకకుండా ఉంటే ఆశించిన దిగుబడులు సాధించే అవకాశం ఉంది. గతేడాదితో పోల్చితే ఈసారి జిల్లా రైతుల్లో మామిడి తోటలు ఆశలు రేకెత్తిస్తున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 16వేల ఎకరాల్లో సాగు

జిల్లాలో 16 మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 16 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నట్లు ఉద్యానశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జిల్లాలోని కాసిపేట, మంచిర్యాల, చెన్నూర్, కోటపల్లి, మందమర్రి, జైపూర్, తాండూర్, హాజీపూర్, భీమారం, నెన్నెల, వేమనపల్లి, బెల్లంపల్లి, కన్నెపల్లి, దండేపల్లి మండలాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. నాలుగేళ్లుగా ప్రకృతి అనేక ఆటుపోట్లను కల్పించింది. మామిడి చెట్లకు పూత సరిగా రాక, వచ్చిన పూత పిందెదశకు చేరక, చీడపీడలు, తెగుళ్లు ఆశించాయి. ఈ కారణంగా పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. ఈసారైనా వచ్చిన పూత వచ్చినట్టే నిలిచి మొగ్గ తొడిగి కాపునకు వచ్చే వరకు ప్రకృతి కరుణించాలని రైతులు ఆశిస్తున్నారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

సాధారణంగా చెట్టు నిండా పూత వచ్చినా అదంతా పిందెదశకు చేరే అవకాశాలు ఉండవు. వచ్చిన పూత సగానికి పైగా రాలి పోయే అవకాశాలు ఉంటాయని ఉద్యానవనశాఖ అధికారులు పేర్కొంటున్నారు. మామిడిచెట్లకు పూత వచ్చేందుకు గతేడాది డిసెంబర్‌లో రైతులు మందులు పిచికారీ చేశారు. అయితే పూత ఏపుగా వచ్చి ఆశాజనకంగా ఉన్నా సంరక్షించుకోవడానికి రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాల్సి ఉంటుంది. చెట్లకు బూడిద, బూజు తెగుళ్లు ఆశించడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. చీడపీడలు, తెగుళ్ల ప్రభావం ఏమాత్రం కనిపించినా వెంటనే స్పందించాలి. అనివార్యమైన పరిస్థితుల్లో సిఫారసు చేసిన మందులను మాత్రమే పూతపై స్ప్రే చేయాలని ఉద్యానవన అధికారులు పేర్కొంటున్నారు. ఇష్టానుసారంగా తమకు తోచిన పద్ధతుల్లో మందులు పిచికారీ చేయవద్దని సూచిస్తున్నారు. పూత మొగ్గ తొడిగి, పిందెదశకు చేరే వరకు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఆ దిశగా పంట సంరక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లీజుకు సన్నాహాలు

మామిడి చెట్లకు పూత రావడమే తరువాయి గుత్తేదారులు, గుమాస్తాలు, దళారులు తోటల బాట పడుతున్నారు. చెట్లకు వచ్చిన పూతను అంచనా వేసి మామిడి కాపును లీజుకు తీసుకోవడానికి బేరసారాలు చేస్తున్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న దశేరి, బంగెనపల్లి వంటి రకాలకు జిల్లాలోని మామిడి చెట్లు ఎంతో ప్రసిద్ధి గాంచాయి. మామిడి ఉత్పత్తులను అమ్ముకోవడానికి రైతులు ఏటా నానాతిప్పలు పడుతున్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ మార్కెట్‌కు తీసుకెళ్లి దళారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి పంటను విక్రయిస్తున్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకున్న బడా వ్యాపారులు సిండికేట్‌గా మారి కనీస మద్దతు ధరకూడా గిట్టుబాటు కాకుండా చేస్తుండటంతో నష్టాలపాలవుతున్నారు. బెల్లంపల్లి కేంద్రంగా రూ.1.26 కోట్ల అంచనాతో మ్యాంగో మార్కెట్ నిర్మాణం చేసినా క్రయవిక్రయాలు జరగడంలేదు. ట్రేడర్స్ లైసెన్స్‌లు తీసుకోకుండా నిరాకరిస్తున్నారు. వీరికి సరైన అవగాహన కల్పించి స్థానికంగానే మామిడి ఉత్పత్తుల అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవడంలో పాలకులు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

సూచనలు కరువు

మెట్ట ప్రాంత రైతులకు పండ్ల తోటల పెంపకంపై ప్రోత్సాహంతో పాటు సూచనలు కరువయ్యాయి. తోటలకు ఏ పరిస్థితిలో ఎలాంటి మందులు వాడాలనే సూచనలు ఇచ్చే హార్టికల్చర్ అధికారుల జాడ కనిపించడం లేదు. కనీసం పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, బీమా సౌకర్యం గూర్చి సమాచారం తెలియడం లేదని మండల సమావేశాల్లో పలువురు ప్రజాప్రతినిధులు ఆరోపణలు చేసిన ఫలితం కనిపించలేదు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో రైతులు తమకు తోచిన మందులను పిచికారీ చేసి నష్టపోతున్నారు. పూతదశలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి చీడపీడలు, తెగుళ్లను గుర్తించి సరైన మందులు సూచించాల్సి ఉంది.

పూత బాగానే వచ్చింది



మామిడి చెట్లకు ఈ ఏడు పూత బాగానే వచ్చింది. కాత కూడా బాగా ఉండాలి. గతేడాది ఎక్కువగా కాయలోపల పురుగు ఆశించి నష్టపోయాం. ఈ ఏడు ఎలా ఉంటుందో చూడాలి.

– తిరుపతి, మామిడి రైతు, బుద్దారం

సూచనలు ఇచ్చే వారు లేరు



మామిడి తోటల పెంపకంపై మాకు సూచనలు ఇచ్చే వారు కరువయ్యారు. మాకు తెలిసిన మందులు పిచికారీ చేసుకుంటున్నాం. వాతావరణంలో మార్పులతో మామిడి పూత, పిందెలు రాలిపోతున్నాయి.

– అరుణ్‌సింగ్, మామిడి రైతు, నెన్నెల

జాగ్రత్తలు తీసుకోవాలి



గతేడాదితో సరిచూస్తే ఈసారి మామిడి చెట్లకు పూత నిండుగా వచ్చింది. వచ్చిన పూత పూర్తిగా నిలవదు. కొంత రాలిపోతుంది. ఇష్టారీతిగా మందులు స్ప్రే చేయవద్దు. ఉద్యానవన అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి. యాజమాన్య పద్ధతులు పాటించాలి.

– ఉదయ్‌కుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, మంచిర్యాల

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న పవర్ ప్లాంట్ కార్మికులు

పాతమంచిర్యాల: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శాలివాహన పవర్ ప్లాంట్ కార్మికులు సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పవర్ ప్లాంట్ కార్మికసంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్ మాట్లాడుతూ ప్లాంట్ మూసివేసి 14 నెలలైనప్పటికీ యాజమాన్యం కార్మికులకు రావాల్సిన వేతనాలు, ఇతర బెనిఫిట్‌లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఆరు రోజులుగా ప్లాంట్ గేట్ ఎదుట నిరాహారదీక్ష చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా కార్యదర్శి మద్దూరి రాజు యాదవ్, పవర్ ప్లాంట్ కార్మికులు పాల్గొన్నారు.

అధ్యక్షురాలిగా అరుణాబాయి



ఆసిఫాబాద్: తెలంగాణ రాష్ట్ర రవాణా ఉద్యోగుల సంఘం కాళేశ్వరం జోన్ అధ్యక్షురాలిగా జాదవ్ అరుణాబాయి ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధికారి కృష్ణయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవాణాశాఖ కార్యాలయంలో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న అరుణాబాయిని అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. జిల్లా రవాణా శాఖ అధికారి గంధం లక్ష్మి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

గ్రీన్‌వుడ్ పాఠశాలపై చీటింగ్ కేసుకు ఆదేశాలు

రామకృష్ణాపూర్: సీబీఎస్‌ఈ అనుమతి లేకున్నా ఉందంటూ తల్లిదండ్రులను మోసం చేసిన మంచిర్యాల జిల్లాలోని గద్దెరాగిడి గ్రీన్‌వుడ్ పాఠశాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డీఈవో యాదయ్య సోమవారం ఎంఈవో పోచయ్యకు ఆదేశాలు జారీ చేశారు. సీబీఎస్‌ఈ గుర్తింపు లేకపోయినప్పటికీ సీబీఎస్‌ఈ పేరిట అడ్మిషన్లు తీసుకుని పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేశారన్న తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి కేసు నమోదుకు ఆదేశించినట్లు డీఈఓ 'సాక్షి'కి తెలిపారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

ఆసిఫాబాద్: హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ సోమవారం తీర్పు చెప్పారు. కాగజ్‌నగర్ టౌన్ సీఐ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం 2020 సంవత్సరంలో కాగజ్‌నగర్ పట్టణంలోని సర్దార్ బస్తీకి చెందిన జాడి జశ్వంత్‌ను అదే బస్తీకి చెందిన బావండపల్లి ప్రవీణ్‌కుమార్ హత్య చేయడంతో కేసు నమోదైంది. అప్పటి ఐఓడీ సీఐ మోహన్ విచారణ జరిపారు. ఈ కేసులో పీపీ జగన్మోహన్ రావు కోర్టులో సాక్షులను ప్రవేశ పెట్టగా నేరం రుజువైంది. హ త్యకు పాల్పడిన ప్రవీణ్‌కుమార్‌కు ఐపీసీ సెక్షన్ 302 ప్రకారం జీవితఖైదుతో పాటు రూ. 20 వేలు జరి మానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మృతదేహం లభ్యం



గుర్తు తెలియన వ్యక్తి మృతదేహం

మంచిర్యాలక్రైం: మంచిర్యాల–పెద్దంపేట రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిందని జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ కుమార్ తెలిపారు. మృతునికి సుమారు 35 సంవత్సరాలు ఉంటాయని, నలుపు రంగు చొక్కా, లేత పచ్చరంగు జీన్స్‌ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. అతనికి సంబంధించిన ఎలాంటి ఆధారా లు లభించలేదని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి లో భద్రపర్చినట్లు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 8712658596, 8328512176 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఏరియాలో సేఫ్టీ జీఎం పర్యటన



కేజీ తివారీని సన్మానిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో సోమవారం కొత్తగూడెం రీజియన్ సేఫ్టీ జీఎం కేజీ తివారీ పర్యటించారు. ఖైరిగూడ ఓసీపీని సందర్శించి ఓసీపీలో చేపట్టిన రక్షణ పద్ధతులను పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో ఉద్యోగుల భద్రత, రక్షణకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చిన్న చిన్న నిర్లక్ష్యాలే పెద్ద పెద్ద ప్రమాదాలకు కారణమవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ రక్షణ సూత్రాలను తూచా తప్పకుండా పాటిస్తూ రక్షణ పరికరాలను ఉపయోగించాలన్నారు. సేఫ్టీ జీఎం హోదాలో మొదటి సారి ఏరియా పర్యటనకు వచ్చిన సందర్భంగా కేజీ తివారీని గోలేటి లోని జీఎం కార్యాలయంలో ఎస్వోటూ జీఎం మచ్చగిరి నరేందర్, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహరా, డీజీఎం ఫైనాన్స్ రామారావు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి సన్మానించారు.

బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెంచాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేయడానికి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెంచాలని శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌వోటూ జీఎం కే.రఘుకుమార్ కోరారు. సోమవారం ఎస్సార్పీ 3, 3ఏ గనిపై మల్టీ డిపార్టుమెంటల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ఆర్థిక స్థితిగతులు తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఉద్యోగిపై ఉందన్నారు. భూగర్భ గనుల్లో ఉత్పత్తి ఖర్చును తగ్గించుకోవడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఖర్చు తగ్గించుకుంటేనే సంస్థ మరింత లాభాలు గడిస్తుందన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు. యంత్రాల వినియోగం, పనిగంటలు మరింత పెరగాలన్నారు. నాణ్యమైన బొగ్గును రవాణా చేసినప్పుడే సంస్థ నిలబడగలుగుతుందన్నారు. ఇందుకు అన్ని డిపార్టుమెంట్లు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో గుర్తింపు సంఘం ఏరియా బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజీఎం మురళీధర్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవి, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, గ్రూప్ ఏజెంట్ గోపాల్‌సింగ్, గని మేనేజర్ సంతోశ్‌కుమార్, ఏఐటీయూసీ నాయకులు వీరభద్రయ్య, కొమురయ్య, మురళి చౌదరి, అధికారులు శ్రీధర్, మహేందర్, ప్రేమ్‌కుమార్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

బైక్‌తో సహా ఒకరు సజీవదహనం

- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘటన
- మృతుడు కాగజ్‌నగర్ వాసి



నాగరాజు (ఫైల్)

భువనగిరి క్రైం: ఓ వ్యక్తి బైక్‌తో సహా సజీవదహనమైన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన సూర నాగరాజు (39) హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మధుమేహంతో పాటు ఇతర వ్యాధులతో బాధపడుతున్నాడు. సోమవారం తెల్లవారుజామున బైక్‌పై భువనగిరి మండలం అనంతారం గ్రామంలోని ఫ్లెట్లైవర్ బ్రిడ్జి వద్దకు చేరుకున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. అనంతరం బైక్‌తో పాటు వ్యక్తి తగలబడిపోతుండడాన్ని స్థానికులు గుర్తించి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బైక్ నంబర్ ఆధారంగా మృతుడు నాగరాజుగా గుర్తించారు. బైక్‌ను తగులబెట్టి ఆపై తానూ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఏసీపీ వెంకట్ రెడ్డి, సీఐ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. మృతుడి బంధువు సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్ సమీపంలోని రాళ్లవాగులో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి (50) మృతదేహం లభించిందని సీఐ రవీందర్ తెలిపారు. మృతుడు భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని, బహిర్భూమికి వెళ్లి ఏదైనా అనారోగ్యం కారణంచేత అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురి గదిలో భద్రపరిచినట్లు తెలిపారు.

డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో హన్మాన్ విగ్రహం వెనుక గల డ్రెయినేజీలో పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆర్పీరోడ్‌లో నివాసం ఉంటున్న బోగె లింగయ్య (40) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఫిట్స్ రావడంతో డ్రెయినేజీలో పడి మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి అతని వద్ద పర్సులో ఉన్న సెల్ ఫోన్ నంబర్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని తల్లి దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



ఆలయం బయట ఉన్న ప్రతిమలకు టెంకాయలు కొడుతున్న మహిళలు



సంప్రదాయ నృత్యం చేస్తున్న మహిళలు



మైసమ్మకు మొక్కుతున్న భక్తులు

'పోతురాజు'కు పోటెత్తిన భక్తజనం

- తరలివచ్చిన ఉమ్మడి జిల్లా ఆదివాసీలు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయం

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని సావర్‌ఖెడా, ఇందాపూర్ సమీపంలో ఉన్న పోతురాజు ఆలయానికి సోమవారం భక్తజనం పోటెత్తింది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆదివాసీలతో పాటు, ఉట్నూర్, వాంకిడి, తిర్యాణి, ఇంద్రవెల్లి, ఆసిఫాబాద్, జైనూర్, నార్నూర్, మహా రాష్ట్రలోని జివితి, ఆదిలాబాద్ తదితర మండలాలకు చెందిన భక్తులు తరలివచ్చి పోతురాజు, ధర్మారాజుకు మొక్కులు చెల్లించుకున్నారు. ఐటీడీఏ ఏపీవో భాస్కర్ హాజరై పూజలు చేశారు. మేకలు, కోళ్లను బలి ఇచ్చారు. జెండాను ఎగురవేశారు. పితృదేవతలకు పూజలు చేశారు. మైసమ్మకు నూనెతో అభిషేకం చేశారు. కొలాం సంప్రదాయబద్ధంగా ఆదివాసీ మహిళలు, యువతులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. భీమదేవరా, తదితర ప్రతిమలు, నాలుగు గోత్రాలకు చెందిన నాలుగు జెండాలకు మహిళలు, వృక్షం నీడన ఉన్న మైసమ్మ దేవతకు పురుషులు మొక్కా రు. నిర్వాహకులు సిడాం రాజు, సిడాం ధర్ము, సిడాం చిన్నభీము, సిడాం కట్టి, ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.